సాక్షి కర్నూలు

బుధవారం । 28 । మే । 2025



భవితనివ్వని ‘ఉన్నత విద్య’

యూనివర్సిటీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. కాలం తీరిన కోర్సులు.. ఉపాధి చూపని కోర్సులతో వర్సిటీల్లో సీట్ల భర్తీ గగనమవుతోంది. ఉన్న సీట్లలో సగం భర్తీ కావడం లేదు. 8లో▸



బదిలీల్లో పైరవీలకే పెద్దపీట

వ్యవసాయ శాఖ ఉద్యోగ బదిలీల్లో సిఫారస్‌లు, పైరవీలకే పెద్దపీట వేసినట్లు తెలుస్తోంది. కూటమి పార్టీల నేతల సిఫారస్‌లకు అధికారులు ఆమోదం తెలిపినట్లు సమాచారం. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,591.22
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 11.902
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 2,829
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 128

న్యూస్‌రీల్

తూకాల్లో తేడాలు రానివ్వొద్దు



నిత్యావసరాల నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): తూకాల్లో తేడాలు రాకుండా నిత్యావసరాల సరఫరాకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా తేడాలు ఉన్నట్లు ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ స్థానిక చాణక్యపురిలోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడున్న టేక్ హోం రేషన్‌లోని కంది పప్పు, ఆయిల్ ప్యాకెట్ల నాణ్యత, తూకాలు తీసే యంత్రాలను పరిశీలించారు. అంతేకాక స్టాక్ పాయింట్‌లో ఏ ఆహార పదార్థం ఎంత ఉందో ఉన్న రిజిస్టర్లు, అధికారుల తనిఖీల విషయాలపై ఆరా తీశారు. సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులు తప్పనిసరిగా తనిఖీ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లయ్ డీఎం నాగసుధ, డీఎస్‌ఓ రాజారఘువీర్, అసిస్టెంట్ మేనేజర్ పరిమళ పాల్గొన్నారు.

నేడు ఆదోనిలో గ్రహణమొర్రి స్క్రీనింగ్ శిబిరం

కర్నూలు(హాస్పిటల్): పెదవి, అంగిలి చీలిక(గ్రహణమొర్రి) శస్త్రచికిత్సలకు ఈ నెల 28న ఆదోని ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రం(డైస్)లో ఉచితంగా స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సత్యవతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. నోరు, ముఖ, దవడ ఎముకల శస్త్రచికిత్సల నిపుణులు డాక్టర్ ఎ.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సుంకేసులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కర్నూలు సిటీ: తుంగభద్ర నదీ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు సుంకేసులకు నీటి ప్రవాహం కొనసాగుతోంది. గత వారం రోజులుగా సుంకేసుల బ్యారేజీకి ఇన్‌ఫ్లో ఉంటోంది. మంగళవారం ఎగువ నుంచి బ్యారేజీకి 4,462 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. ఈ నీటిని రెండు గేట్లు అర్ధ మీటర్ పైకెత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. 159 క్యూసెక్కుల నీరు కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని తాగు నీటి అవసరాలకు విడుదలవుతోంది.

అగ్నిమాపక శాఖలో బదిలీలకు మార్గదర్శకాలు

కర్నూలు: అగ్నిమాపక శాఖలో బదిలీలకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. జూన్ 2వ తేదీ లోగా అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీలను పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అగ్నిమాపక శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ మార్గదర్శకాలను జారీ చేశారు. ఒకే స్టేషన్‌లో ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారికి తప్పనిసరిగా బదిలీ కానుంది. ఫైర్‌మెన్‌లు, డ్రైవర్, ఆపరేటర్లు, లీడింగ్ ఫైర్‌మెన్లను ఒక స్టేషన్ నుంచి మరో స్టేషన్‌కు బదిలీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో 12 అగ్నిమాపక శాఖ స్టేషన్లు ఉండగా బదిలీలకు సుమారు 40 మంది దాకా అర్హులుగా గుర్తించినట్లు సమాచారం.

న్యాయ సహాయం పొందండి



మహిళతో మాట్లాడుతున్న జడ్జి బి.లీలా వెంకట శేషాద్రి

నంద్యాల(వ్యవసాయం): మానసిక వికలాంగుల సంక్షేమ కోసం న్యాయ సహాయం అందించేందుకు ఎల్‌ఎస్‌యూఎం కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి బి.లీలా వెంకటశేషాద్రి అన్నారు. నంద్యాల శివారు ప్రాంతంలోని శాంతిరాం ఆసుపత్రిలోని మానసిక వికలాంగుల విభాగాన్ని మంగళవారం ఆయన లీగల్ సర్వీస్ యూనిట్ ఫర్ మావోనియా కమిటీ సభ్యులతో కలసి తనిఖీ చేశారు. అనంతరం వార్డులోని మానసిక వికలాంగులతో కలిసి మాట్లాడుతూ వారి ఆరోగ్యాల గురించి తెలుసుకుని, న్యాయ పరమైన హక్కుల గురించి వారికి తెలియజేశారు. ఆయన వెంట న్యాయవాదులు శేష సాయి, జీవన్ కుమార్, శాంతిరాం హాస్పిటల్ ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత్, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ పీఎస్ మూర్తి, డాక్టర్ సింధూ, రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

నిర్లక్ష్యం.. బుసలు కొడుతోంది!







☛ నాలుగు రోజుల క్రితం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎన్‌టిఆర్ వైద్యసేవ కార్యాలయంలో పది అడుగుల నాగుపాము కనిపించింది. గది బయట బుసలుకొడుతున్న పామును చూసి ఓ ఉద్యోగికి గుండె ఆగినంత పనయింది. వెంటనే తేరుకొని కేకలు వేయగా చుట్టుపక్క ఉద్యోగులు వచ్చేసరికి ఓ తొర్రలోకి జారుకుంది. దీంతో మళ్లీ అది బయటకు రాకుండా సిమెంట్‌తో ఆ తొర్రను మూసేశారు.



☛ ఆసుపత్రిలోని ఓ అధికారి ఛాంబర్‌లో ఎలుకలు విపరీతంగా వచ్చి ఫైళ్లు పాడుచేసేవి. ర్యాట్‌ప్యాడ్‌లు పెట్టినా ఫలితం లేకపోయింది. దీంతో ఆయన కాస్త తెలివిగా ఆలోచించాడు. ఎక్కడికక్కడ బిస్కెట్లను ఏర్పాటు చేయడంతో వాటిని తిన్న ఎలుకలు ఫైళ్ల జోలికి వెళ్లకపోవడం గుర్తించాడు. ఇదేదో బాగుందని అదే ఉపాయాన్ని కొనసాగించారు.



☛ ఆసుపత్రిలో చెట్ల నీడ ఉందని వెళ్లి భోజనానికి కూర్చుంటే చాలు పందులు, కోతులు, కుక్కలతో పాటు ఎలుకలు కూడా వస్తున్నాయి. వీటి వల్ల రోగుల సహాయకులు ప్రశాంతంగా నాలుగు ముద్దలు కూడా తినలేని పరిస్థితి. రాత్రయితే చాలు దోమల దండయాత్ర నిద్రను దూరం చేస్తోంది. రాత్రిపూట అటుంచితే.. పట్టపగలే ఆసుపత్రి ఆవరణలో పాములు తిరుగాడుతుండటంతో రోగుల గుండె జారుతోంది. ఎలుకలు పట్టేందుకు బోధనాసుపత్రిలో ఏటా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నా.. సమస్య పరిష్కారం కాకపోవడం గమనార్హం.



ఆసుపత్రిలో ఆవరణలో పాము, ఎలుకలను చంపేసిన దృశ్యం

సంచరిస్తున్న ఉడుము

పెద్దాసుపత్రిలో విషపురుగులు

- యథేచ్ఛగా తిరుగాడుతున్న పాములు, ఎలుకలు
- రాత్రిళ్లు దోమల బెడదతో సతమతం
- రూ.70లక్షలు వెచ్చిస్తున్నా ఫలితం అంతంతే..
- నిర్వహణ కంపెనీ పనితీరు నామమాత్రం
- రోగులు, సహాయకుల అవస్థలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు కర్నూలు మెడికల్ కాలేజీ, ప్రాంతీయ కంటి ప్రభుత్వ ఆసుపత్రిలలో పెస్ట్ కంట్రోల్ నిర్వహణను ఓ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. ఈ మేరకు బోధనాసుపత్రిలో సైంటిఫిక్ శానిటేషన్ పాలసీ కింద దోమలు, బల్లులు, బొద్దింకలు, ఈగలు, ఎలుకలు, పాములు, ఇతర విషకీటకాల నివారణకు వాడే పెస్టిసైడ్స్‌ను మధ్యాహ్నం వరకు హెల్త్ సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో ఫాగింగ్ చేయాల్సి ఉంటుంది. ఎలుకలు, పాములు ఉంటే వాటిని పట్టుకుని సంహరించాలి. ఈ మేరకు నిర్వహణకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నెలకు రూ.5లక్షలు, ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో రూ.30వేలు, మెడికల్ కాలేజిలో మరో రూ.30 వేలు కలిపి నెలకు రూ.5.90 లక్షలు, ఏడాదికి రూ.70,80,000 వెచ్చిస్తున్నారు. నిర్వహణ సంస్థలో పది మంది సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం ఆరుగురితో మమ అనిపిస్తుండటం వల్లే విష పురుగులు యథేచ్ఛగా తిరుగాడుతున్నాయని తెలుస్తోంది.



కారు షెడ్డులో రోగుల సహాయకుల దోమల నెట్

పట్టపగలే ఎలుకలు, పాముల సంచారం

ఆసుపత్రి, కళాశాల ఆవరణలో రాత్రేమో గానీ ఖాళీ ప్రదేశాల్లో పట్టపగలే ఎలుకలు, పాములు సంచరిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు అవి బయటకు వచ్చి వార్డులు, కార్యాలయ గదుల్లోకి దూరుతున్నాయి. ముఖ్యంగా ఓల్డ్ గైనిక్ విభాగం, శక్తిసదన్, కంటి ఆసుపత్రిలోని ఖాళీ ప్రదేశాలు, డైట్ విభాగం, దాని పక్కనున్న ఖాళీ ప్రదేశాలు, క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రాంతం, సూపర్‌స్పెషాలిటి విభాగం పక్కనున్న ఖాళీ ప్రదేశం, ఐడీ వార్డు, మానసిక వ్యాధుల విభాగం, యుపీ, పీజీ హాస్టల్స్ పరిసరాలు పాములకు నిలయాలుగా మారాయి. ఆయా పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, మొక్కలు ఏపుగా పెరగడంతో ఎలుకలు ఎక్కువగా తిరుగుతున్నాయి. వీటిని తినేందుకు పాములు వస్తున్నాయి. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వద్ద ఇటీవల నిరుపయోగంగా ఉన్న ఇనుప సామానుఅంతా కుప్పపోసి ఉంచారు. వాటిని టెండర్ పాడిన వారు తీసుకెళ్లకపోవడంతో ఆ ప్రాంతంల్లో పాముల సంచారం అధికంగా ఉంటోందని రోగుల సహాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోగుల బంధువులు ఆరుబయట భోజనం చేసి, అక్కడే చేతులు కడుక్కోవడంతో మిగిలిపోయిన ఆహారాన్ని తినేందుకు ఎలుకలు, బొద్దింకలు అధికంగా పుట్టుకొస్తున్నాయి.

చీకటి పడితే చాలు దోమల బెడద

బోధనాసుపత్రిలో రోజూ సాయంత్రం అయితే చాలు దోమలు విజృంభిస్తున్నాయి. వాటి బారి నుంచి రక్షణ పొందేందుకు రోగులు, వారి సహాయకులు మస్కిటో కాయిల్స్, లిక్విడ్స్ వాడుతున్నారు. అన్ని విభాగాల్లో ఈ పరిస్థితి కొనసాగుతోంది.

తూతూ మంత్రంగా పెస్ట్‌కంట్రోల్ నిర్వహణ

ఆసుపత్రిలో పెస్ట్ కంట్రోల్ నిర్వహణ తూతూ మంత్రంగా జరుగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే సంబంధిత ప్రాంతానికి వెళ్లి విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు పాములు, ఎలుకలు, పందికొక్కులు తిరిగే చోటును గుర్తించి తగిన చర్యలు తీసుకోవాల్సిన ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని తెలుస్తోంది. వీరి పనితీరును బట్టి అధికారులు మార్కులు వేయాల్సి ఉంటుంది. పనితీరు సరిగ్గా లేకపోవడంతోనే ఇటీవల మూడు నెలలుగా బిల్లులకు ఆసుపత్రి అధికారులు బ్రేక్ వేశారు. టెండర్ కాలపరిమితి ముగియడంతో అధికారుల చర్యలకు సైతం కాంట్రాక్టర్ స్పందించడం లేదని సమాచారం.

పగలు ఈగలు, రాత్రి దోమల బాధ



మా అక్క కూతురు కాన్పు కోసం 16 రోజుల క్రితం గైనిక్ వార్డులో చేర్చాం. ఆమెకు రక్తస్రావం అవుతుంటే ప్రసవం ఆలస్యం అవుతోంది. ఈ క్రమంలో పగలు, రాత్రి వార్డు బయటే వేచి ఉండాల్సి వస్తోంది. ఇక్కడి కారు షెడ్డులో రాత్రివేళ ఉంటున్నాం. ఇక్కడ పగలు ఈగలు, రాత్రి దోమల బాధ భరించలేకున్నాం. ఏదైనా తిందామంటే కూడా తిప్పలే. అందుకనే నెట్ తెచ్చుకొని అందులో ఉంటున్నాం.

– అంజలి, నంద్యాల పట్టణం

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



ఆసుపత్రిలో ఎలుకలు పట్టేందుకు అవసరమైన ప్యాడ్‌లను ఏజెన్సీ వారు తెప్పించారు. పాములు రాకుండా అవసరమైన రసాయనాలు అక్కడక్కడా ఉంచుతున్నారు. ఎక్కడైనా ఎలుకలు, పాములు సంచరిస్తున్నట్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

పోస్టల్ కొత్త ఖాతాలకు స్పెషల్ డ్రైవ్



జి.జనార్దన్‌రెడ్డి

కర్నూలు(అర్బన్): గ్రామ/వార్డు సచివాలయా ల స్థాయిలో ‘ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు’ ద్వారా కొత్త ఖాతాలను తెరిచేందుకు ఈ నెల 31 నుంచి జూన్ 4వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కర్నూలు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ కొత్త ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేయడంతో పాటు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కూడా చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.ఇందులో భాగంగా కొత్త ఐపీపీబీ బ్యాంకు ఖాతాలను తెరవడం, ఇప్పటికే ఉన్న ఐపీపీ బీ బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ చేయడం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మ్యాపింగ్‌లను సులభతరం చేయడం ప్రాథమిక లక్ష్యమన్నారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న 15,365 ఖాతాలను జిల్లా వ్యాప్తంగా ఉన్న 434 పోస్టాఫీసుల ద్వారా పునరుద్ధరణ జరుగుతుందన్నారు. మరింత సమాచారం కోసం లబ్ధిదారులు సమీపంలోని పోస్టాఫీసులను సంప్రదించాలన్నారు.

ముగిసిన ఏపీఈఏపీ సెట్ పరీక్ష

కర్నూలు సిటీ: ఇంజినీరింగ్, అగ్రికల్చర్-ఫార్మసీ ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఏపీఈఏపీ సెట్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఉమ్మడి జిల్లాలో 12 కేంద్రాల్లో ఈ నెల 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు కర్నూలు జిల్లాలో అగ్రికల్చర్ విభాగంలో 6370, ఫార్మసీ నందు 5972 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంజినీరింగ్ పరీక్ష ఈ నెల 21వ తేదీ నుంచి మంగళవారం వరకు జరగ్గా 12,522 మందికిగాను 11,855 మంది హాజరయ్యారు. అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజినీరింగ్ పరీక్షలకు మొత్తం 18,892 మందికిగాను, 17,827 మంది హాజరయ్యారు. నంద్యాల జిల్లా నుంచి అగ్రికల్చర్ పరీక్షకు 2849 మంది, ఫార్మసీ పరీక్షకు 2655 మంది, ఇంజినీరింగ్ పరీక్షలకు 5409 మందికిగాను 5205 మంది విద్యార్థులు కలిపి మొత్తం 8258 మందికిగాను 7860 మంది హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.

నేడు ఉద్యం వర్క్‌షాపు

కర్నూలు(టౌన్): స్థానిక బి.క్యాంపులోని జిల్లా పరిశ్రమల కేంద్రం కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఉద్యం వర్క్ షాపు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్క్‌షాపులో ఉద్యం రిజిస్ట్రేషన్ పోర్టల్ కింద నమోదు కాని ఎంఎస్‌ఎంఈ(సూక్ష్మ చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు)లకు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా ఉద్యం నమోదు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

జెడ్పీ పరిధిలో బదిలీలకు 134 దరఖాస్తులు

కర్నూలు(అర్బన్): జిల్లాపరిషత్ పరిధిలో బదిలీలకు అర్హులైన 134 మంది ఉద్యోగులు తమ దరఖాస్తులను అందజేసినట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎంపీడీఓ, పరిపాలన అధికారులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, రికార్డు, లైబ్రరీ, ల్యాబ్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లు ఉన్నారన్నారు. వీరిలో ఐదేళ్ల ఒకే ప్రాంతంలో సర్వీస్ పూర్తి చేసుకున్న వారు 57 మంది ఉన్నట్లు సీఈఓ పేర్కొన్నారు.

మొదలైన తొలకరి

- నైరుతి ప్రభావంతో కురుస్తున్న వర్షాలు
- వర్షాధార పంటల సాగుకు జూన్, జూలై నెలలు అనుకూలం

కర్నూలు(అగ్రికల్చర్): నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో తొలకరి మొదలైంది. ఈ సారి ముందుగానే రుతుపవనాలు విస్తరించాయి. ఈ ప్రభావం వల్ల రానున్న 5 రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు ప్రకటించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం ఉదయం వరకు అన్ని మండలాల్లో వర్షం కురిసింది. జిల్లా మొత్తం మీద సగటున 16.1 మి.మీ వర్షపాతం నమోదైంది. మే నెల 27 నాటికి సాధారణ వర్షపాతం 34.9 మి.మీ ఉండగా.. 103.3 మి.మీ వర్షం కురిసింది. వర్షాధారంగా వేరుశనగ, కంది, పత్తి, ఆముదం సాగు చేసే రైతులు ఖరీఫ్ సీజన్‌కు భూములను సిద్ధం చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. వర్షాధార పంటల సాగుకు విత్తనాలు విత్తుకునేందుకు జూన్-జూలై మాసాలు అనుకూలమని వ్యవసాయ వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త నారాయణస్వామి తెలిపారు.



కర్నూలు శివారులో కమ్ముకున్న మబ్బులు

మండలం	వర్షపాతం(మి.మీ)
కౌతాళం	42
పెద్దకడుబూరు	38.4
ఎమ్మిగనూరు	37.2
ఆదోని	28.6
హాలహర్వి	26.6
ఆలూరు	24.2
కోసిగి	22.8
గోనెగండ్ల	17.2
మద్దికెర	17.2
ఆస్పరి	14.8

1,104 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 59 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన సెమిస్టర్ పరీక్షలకు 1,104 మంది గైర్హాజరయ్యారు. 2వ సెమిస్టర్ పరీక్షలకు 10,110 మందికిగాను 9,027 మంది హాజరు కాగా 1,083 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 176 మందికిగాను 155 మంది విద్యార్థులు హాజరు కాగా 21 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ముగ్గురు విద్యార్థులు చూచిరాతకు పాల్పడగా గుర్తించి డిబార్ చేసినట్లు వెల్లడించారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు నేటి(బుధవారం) నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురువయ్య శెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యా హ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామన్నా రు. జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన జూనియర్ కాలేజీలన్నింటికీ కర్నూలు నగరంలోని ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కాలేజీలో జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు బి.క్యాంపులోని ప్రభుత్వ ఒకేషనల్ కాలేజీ కేంద్రంగా ఉంటుందన్నారు. జనరల్ ప్రాక్టికల్ పరీక్షలకు 64 మంది, ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 89 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

‘పొగ’పట్టిన కంపెనీలు!

సాగును ప్రోత్సహించి కొనుగోళ్లకు వెనుకడుగు

- ఉమ్మడి జిల్లాలో 60,601 టన్నుల పొగాకు దిగుబడులు
- ఇప్పటి వరకు కొనుగోలు 50,874 టన్నులే..
- ‘సాక్షి’ కథనంపై స్పందించిన జేసీ
- నెల రోజుల్లో కొనుగోళ్లు పూర్తిచేయాలని ఆదేశాలు
- ఆ దిశగా చర్యలు చేపట్టని కంపెనీలు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్ మొదలవుతున్నా గత సంవత్సరంలో పండించిన పొగాకు అమ్ముడుపోని పరిస్థితి. వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో పొగాకు నిల్వలను కాపాడుకోవడం రైతులకు భారమవుతోంది. కర్నూలు జిల్లాలో 5,200 టన్నులు, నంద్యాల జిల్లాలో 4,500 టన్నుల పొగాకు నిల్వలు ఇప్పటికీ కొనుగోలుకు నోచుకోకపోవడం చూస్తే కంపెనీల నిర్లక్ష్యం అర్థమవుతోంది. ఈ విషయంపై గత ఏప్రిల్ 25న ‘సాక్షి’లో ‘సాగుకు వెన్నుతట్టి.. కొనుగోళ్లకు పొగపెట్టి’ శీర్షికన ప్రచురితమైన కథనంపై జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య స్పందించారు. అదే నెల 28న కంపెనీల ప్రతినిధులతో సమావేశమై నెల రోజుల్లోపు పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. సరిగ్గా నెల రోజులకు జేసీ నవ్య ఈ నెల 28న తిరిగి పొగాకు కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నారు. ఎక్కడికక్కడ రైతుల వద్ద పేరుకుపోయిన పొగాకు నిల్వలను చూస్తే జేసీ ఆదేశాలను కంపెనీలు పాటించలేదనే విషయం అర్థమవుతోంది.

ఇప్పటి వరకు కొనుగోలు 50,874 టన్నులే..

2024-25లో కర్నూలు జిల్లాలో 36,471 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 30,865 ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. ఎకరాకు సగటున 9 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఈ ప్రకారం కర్నూలు జిల్లాలో 32,823 టన్నులు, నంద్యాల జిల్లాలో 27,778 టన్నుల దిగుబడి వచ్చింది. ఉమ్మడి జిల్లాలో 60,601 టన్నుల దిగుబడి రాగా.. కొనుగోలు చేసిన పొగాకు 50,874 టన్నులు మాత్రమే కావడం గమనార్హం. 2025-26 ఖరీఫ్ సీజన్ మరో నాలుగు రోజుల్లో మొదలవుతోంది. అయితే ఇప్పటికీ ఉమ్మడి జిల్లాలో 9,227 టన్నుల వరకు పొగాకు అలాగే ఉండిపోయింది. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారమే కర్నూలు జిల్లాలో 4,058 టన్నుల పొగాకు నిల్వలు ఉన్నట్లు స్పష్టమవుతోంది.

కంపెనీలు ప్రోత్సహించడంతోనే పెరిగిన సాగు

ఉమ్మడి జిల్లాలో పొగాకు సాగును ప్రోత్సహించడంలో ఇండియన్ టొబాకో కంపెనీ(ఐటీసీ), వర్జీనీయా సుల్తాన్ టొబాకో(వీఎస్‌టీ), జీపీఐ, ప్రీమియర్ టొబాకో ప్యాకర్స్, అలియన్స్ కంపెనీలు ప్రధానమైనవి. 2023-24లో కర్నూలు జిల్లాలో 9,586 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 8,791 ఎకరాల్లో మాత్రమే పొగాకు సాగయింది. ఆ ఏడాది సాగు తక్కువ, డిమాండ్ ఎక్కువగా ఉండటం వల్ల క్వింటాకు రూ.20 వేల వరకు ధర లభించింది. డిమాండ్‌కు అనుగుణంగా పొగాకు లేకపోవడంతో 2024-25లో పొగాకు సాగును కంపెనీలు ప్రోత్సహించాయి. ఇందువల్ల సాగు భారీగా పెరిగింది. ఊహించిన దానికంటే సాగు పెరగడంతో కంపెనీలు కొనుగోళ్లలో అలసత్వం వహించాయి. రాజకీయ నేతలు, వారి సిఫారసులు ఉన్న వారి పొగాకు కొనుగోలు చేసి, సాధారణ రైతులను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా ఇప్పటికీ పొగాకు నిల్వలు ఎక్కడికక్కడ పేరుకుపోయాయి.



ఉల్చాల గ్రామంలో పొగాకు నిల్వలు



పాములపాడులో తడిచిన పొగాకు దిగుబడి (ఫైల్)

క్వింటా కూడా అమ్ముడుపోలేదు



రెండు ఎకరాల్లో పొగాకు సాగు చేశాం. ఎకరాకు రూ.60 వేల వరకు పెట్టుబడి పెడితే 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఇంతవరకు క్వింటా కూడా అమ్ముడుపోలేదు. నిల్వలను వర్షాల నుంచి కాపాడుకునేందుకు చుక్కలు చూడాల్సి వస్తోంది. పొగాకు కొనుగోలు చేయాలని కంపెనీల చుట్టూ తిరుగుతున్నాం. ఇటీవల జేసీని కలసి న్యాయం చేయాలని కోరాం.

–పి.వెంకటరాముడు, ఉల్చాల, కర్నూలు మండలం

సాగు పెరగడంతోనే ధరలో కోత

- 2024-25లో పండించిన పొగాకు ధరను కంపెనీల అసోసియేషన్ క్వింటాకు రూ.15,500లుగా నిర్ణయించింది.
- నాణ్యత బాగున్నప్పటికీ రూ.10వేల నుంచి రూ.13వేల వరకు ధర మాత్రమే లభిస్తోంది.
- మొదట్లో క్వింటాకు రూ.14వేలు-రూ.15 వేల వరకు ధర వేసిన కంపెనీలు ఇప్పుడు క్వింటాకు రూ.2వేల-రూ.2,500 వరకు కోత పెడుతున్నాయి.
- రికార్డు స్థాయిలో సాగు కావడంతోనే నిర్ణయించిన ప్రకారం కొనుగోలు చేయడానికి కంపెనీలు వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.
- తేమ శాతం, ఆకు విరగడం, ఇతర నాణ్యత ప్రమాణాలను బూచిగా చూపి ధరను అడ్డంగా కోసేస్తున్నారు.

క్లుప్తంగా

బలిజ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

కర్నూలు (అర్బన్): ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి, ఇంటర్‌లో 90 శాతం మార్కులు సాధించిన కర్నూలు జిల్లా బలిజ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నట్లు బలిజ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మన్న, రవికుమార్ మంగళవారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మార్కుల జాబితా, చిరునామా, ఫోన్ నంబర్లను సంఘం ప్రధాన కార్యదర్శి 9000009440 నంబర్‌కు ఈనెల 30వ తేదీ లోపు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు. జూన్ 1న ప్రతిభ పురస్కారాల ప్రదాన కార్యక్రమం కర్నూలులో ఉంటుందన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల నగదు బహుమతులు అందజేస్తామని, మిగిలిన మెరిట్ విద్యార్థులందరికీ మొమెంటో, ఎగ్జిక్యూటివ్ ఫైల్, ప్రతిభ పురస్కార పత్రం ఇవ్వనున్నామన్నారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షులు పత్తి ఓబులయ్య, ప్రధాన సలహాదారులు డాక్టర్ సింగం శెట్టి సోమశేఖర్, ఉపాధ్యక్షుడు ఈశ్వర్ కుమార్, కోశాధికారి శైలేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏపీఆర్‌జేసీ ప్రవేశాల కౌన్సెలింగ్



విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న లెక్చరర్లు

ఎమ్మిగనూరురూరల్: ఏపీఆర్‌జేసీ ప్రవేశాల కౌన్సెలింగ్ కొనసాగుతోంది. మంగళవారం మండల పరిధిలోని బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంట్రెన్స్ టెస్ట్ రాసిన అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూర్ జిల్లాల విద్యార్థినులకు ర్యాంక్ ఆధారంగా మొదటి విడతలో ఎంపీసీ, బైపీసీ విభాగాలకు కౌన్సెలింగ్ చేపట్టినట్లు ప్రిన్సిపాల్ గిర్వాణీ తెలిపారు. మొదటి విడత పూర్తయిన తర్వాత మిగిలిన సీట్లకు మరోసారి కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

మూల్యాంకనానికి ఏర్పాట్లు

కర్నూలు సిటీ: ఈ నెల 19వ తేదీ నుంచి మొదలైన పదో తరగతి సప్లమెంటరీ ప్రధాన పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. మైనర్ మీడియంకు చెందిన పరీక్ష బుధవారం జరగనుంది. పరీక్షలు ముగియడంతో మూల్యాంకనానికి ప్రభుత్వ పరీక్షల విభాగం ఏర్పాట్లు చేస్తోంది. సప్లమెంటరీ పరీక్షలకు సంబంధించిన సమాధాన పత్రాలు జిల్లాకు సుమారుగా 20 వేలు రానున్నాయి. ఈ నెల 31, జూన్ 1, 2 తేదీల్లో మూల్యాంకనం జరుగనుంది. ప్రస్తుతం పేపర్ కోడింగ్ జరుగుతోంది.

మహిళ అదృశ్యం



ప్రమీలమ్మ

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని సిద్దప్ప పాళెం దుర్గానగర్‌లో నివాసముంటున్న ఆదోని ప్రమీలమ్మ అనే మహిళ ఈనెల 20వ తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఆదోని శ్రీనివాసులు, దుబ్బన్న, వీరేష్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె వయస్సు 50 సంవత్సరాలు ఉంటుందన్నారు. ఆమె భర్త ఆదోని ఈరన్న కొద్ది కాలం క్రితం హత్యకు గురై మృతి చెందాడు. ఆనాటి నుంచి ఆమె మానసికంగా బాధపడుతూ మనోవేదనకు గురైందన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 20వ తేదీన హోటల్‌లో టీ తీసుకొస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. బంధువులు, తెలిసిన వారి వద్ద గాలించినా ఆచూకి లభించలేదని తెలిపారు. ఆచూకి తెలిసిన వారు ఫోన్ నెంబర్ 99853 28667, 91001 39827లకు సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

భావితరాలకు బషీర్ గురుతులు



20ఏళ్లుగా తాను సేకరించిన స్టాంపులను చూపుతున్న పీఆర్ ఏఈ షేక్ బషీర్

- పురాతన కాలం నాటి కెమెరాలు, గ్రామ్ ఫోన్, కేసెట్లు సేకరించి భద్రపరుస్తున్న పంచాయతీ రాజ్ ఏఈ బషీర్
- 20 ఏళ్లుగా పలు దేశాల కరెన్సీ, స్టాంపుల సేకరణ

పంచాయతీ రాజ్ శాఖలో ఏఈగా విధులు నిర్వహించే బషీర్.. పురాతన వస్తువులు, వివిధ దేశాల కరెన్సీ సేకరించి భావితరాలకు తెలియజేసేందుకు భద్రపరుస్తున్నాడు. ఇప్పటి వరకు ఏకంగా 20 దేశాల కరెన్సీతో పాటు పాతకాలపు గ్రామ్‌ఫోన్, రేడియో, కేసెట్లు, కెమెరాలు తన అల్మారాలో ఆకర్షణీయంగా దాచి ఉంచాడు. ఆరో తరగతిలో ప్రారంభమైన కరెన్సీ సేకరణ ఆరు పదుల వయస్సు వచ్చినా కొనసాగిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.



పలుదేశాలకు చెందిన కరెన్సీ కాయిన్స్



పోస్టల్ స్టాంపులు



పురాతన కాలంనాటి కెమెరాలు, గ్రామ్‌ఫోన్‌రికార్డు, కేసెట్లు

జూపాడుబంగ్లా: పాణ్యం మండలం సిమెంట్ నగర్ గ్రామానికి చెందిన షేక్ బషీర్ స్థానిక హైస్కూల్‌లో ఆరోతరగతి విద్యనభ్యశించే సమయంలోనే వెరైటీగా కనిపించే నాణేలను దాచుకునేవాడు. ఐదు, పది, ఇరవై పైసల నాణేలతో పాటు రూపాయి, రెండు రూపాయలు, ఐదు రూపాయల నోట్లను భద్రపరుచుకునేవారు. కాక్రమేణా కాయిన్స్, నోట్లు, స్టాంపుల సేకరణను అలవాటుగా చేసుకున్నారు. బాల్యంలో ప్రారంభమైన హాబీ.. చదువు పూర్తయి ప్రస్తుతం కర్నూలులో నివాసం ఉంటూ జూపాడు బంగ్లాలో పంచాయతీరాజ్ ఏఈగా విధులు నిర్వర్తిస్తున్నా కొనసాగిస్తున్నారు. టూర్లకు వెళ్లినప్పుడు అక్కడ విక్రయించే పలు దేశాల నాణేలు, కరెన్సీ నోట్లు, స్టాంపులను పరిశీలించి తన వద్దలేని వాటిని కొనుగోలు చేసేవారు. ఇప్పటిదాకా రూ.50 వేలు ఖర్చు చేసి పలు దేశాల కాయిన్స్, నోట్లు, స్టాంపులు సేకరించి వాటిని ఇంట్లో గోడలకు అతికించి ఫ్రేమ్ కట్టించినట్లు బషీర్ తెలిపారు.

జ్ఞాపకాల దొంతర..

బషీర్ పాతకాలం నాటి గ్రాంఫోన్‌రికార్డు, టేప్‌రికార్డర్, కెమెరాలు, ఆడియో కేసెట్లు, డీవీడీ ప్లేయర్లు సేకరించి భద్రపరిచారు. ఇంటికి వచ్చిన వారు వాటిని చూసి తమ జ్ఞాపకాలను నెమరేసుకుంటూ బషీర్‌ను అభినందిస్తున్నారు. అలాగే శ్రీకృష్ణదేవరాయలు, విక్టోరియా మహారాణి కాలం నాటి కాయిన్స్ కూడా ఉన్నాయి. 1947 స్వాతంత్ర్యం వచ్చాక ఇండియా గవర్నమెంట్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉన్న అర్ధ అణ, అణ, పైస, రెండుపైసలు, ఐదుపైసలు, 10 పైసలు, 20 పైసలు, పావలా, ఐదు రూపాయలు, పదిరూపాయల కాయిన్స్ సేకరించారు. ఒమన్, మస్కట్, సౌదీ, దుబాయ్, మలేషియా, సింగపూర్, అమెరికా, పాకిస్తాన్ తదితర 20 దేశాలకు చెందిన ప్లాస్టిక్స్ కరెన్సీ నోట్లు, కాగితపు కరెన్సీనోట్లను సేకరించారు. ఇంగ్లాండ్, ఒమన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, కేఎస్ఏ, శ్రీలంక, యునైటెడ్ అరబ్ ఎమిరేటెడ్, కువైట్, బంగ్లాదేశ్, ఇండియాకు చెందిన రాణాప్రతాప్‌సింగ్, నెహ్రూ, మొట్టమొదటి రైలు ఇంజిన్ స్టాంపు, ఆయిల్‌ఎక్స్‌ప్రోషన్, టెక్నాలజీడే స్టాంపు, నహర్‌సింగ్, వంటి అనేక చిత్రాలతో కూడిన పోస్టల్ స్టాంపులున్నాయి.



పీఆర్ ఏఈ బషీర్ సేకరించిన 20 దేశాలకు చెందిన పలురకాల కరెన్సీ నోట్లు

మహిళ ఆత్మహత్య

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని సంత జూటూరు గ్రామానికి చెందిన గోవిందిన్నె బేబీ(42) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ జగన్ మోహన్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బేబీ ఏడేళ్లుగా షుగర్ వ్యాధితో బాధపడుతోంది. డాక్టర్లకు చూపించినా వ్యాధి నియంత్రణ లోకి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది కల్లాపి చల్లే మందు (సౌభాగ్య పౌడర్)ను నీటిలో కలుపుకుని తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108లో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలికి భర్త గతంలోనే మృతిచెందగా.. వివాహమైన కూతురు, కుమారుడు ఉన్నారు. కుమారుడు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్‌యూ సీనియర్ అసిస్టెంట్‌కు మెమో

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ హాస్టల్ ఆఫీస్‌లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఎం.మాలిక్ అహ్మద్‌కు మంగళవారం మెమో ఇచ్చారు. వంశీ అనే విద్యార్థితో ఫోన్‌లో కులం పేరుతో దూషిస్తూ అసభ్యంగా మాట్లాడినట్లు సంభాషణలు విన్న వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బోయ విజయకుమార్ నాయుడు మెమో జారీ చేశారు. ఈనెల 29వ తేదీలోగా వివరణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వివరణ ఇవ్వని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

భవితనివ్వని 'ఉన్నత విద్య'

ప్రశ్నార్థకంగా యూనివర్సిటీలు

- గత ఏడాది భారీగా పడిపోయిన పీజీ అడ్మిషన్లు
- 35 కోర్సులకు అందుబాటులో 2,017 సీట్లు
- 759 సీట్లు మాత్రమే భర్తీ
- ఉపాధి చూపే కోర్సులతోనే వర్సిటీలకు భవిష్యత్తు
- గత ప్రభుత్వం దిద్దుబాటు చర్యలను తొక్కిపెట్టిన కూటమి ప్రభుత్వం



కర్నూలు కల్చరల్: యూనివర్సిటీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. కాలం తీరిన కోర్సులు.. ఉపాధి చూపని కోర్సులతో వర్సిటీల్లో సీట్ల భర్తీ గగనమవుతోంది. ఉన్న సీట్లలో సగం కూడా భర్తీకాకపోవడం విద్యార్థుల్లో అనాసక్తికి నిదర్శనం. గత ఏడాది గణాంకాలను పరిశీలిస్తే మూడు విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ పీజీ కళాశాలల్లో 35 కోర్సులుంటే 37.63 శాతం సీట్లు మాత్రమే భర్తీ కావడం గమనార్హం. చదివే సబ్జెక్టుకి, అవకాశాలకు పొంతన లేకపోవడంతో ఉన్నత విద్యా రంగం భవిష్యత్ అగమ్యగోచరం అవుతోంది. గత ప్రభుత్వం ఉన్నత విద్యా విధానంలో దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించినా కూటమి ప్రభుత్వం తొక్కి పెట్టింది. వర్సిటీలకు పరిశ్రమలను అనుసంధాన చేయడం, హానర్స్ కోర్సుల రూపకల్పన తదితర చర్యలు చేపట్టినా ప్రస్తుతం ఆ ఊసే కరువైంది. ఉన్నత విద్యా మండలి ఈ ఏడాది జూన్ 9వ తేదీ నుంచి పీజీ ప్రవేశాలకు పీజీసెట్-2025 నిర్వహిస్తోంది. అయితే నూతన కోర్సుల రూపకల్పన, ఉపాధినిచ్చే కోర్సుల్లో అప్‌గ్రేడేషన్ చర్యలు చేపట్టిన దాఖలాల్లేవు.

ఇవీ లోపాలు..

- జీఓ 77తో ప్రైవేట్ కళాశాలల్లో పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ తొలగించడం.
- డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్ట్ కోర్సులను ప్రవేశ పెట్టడం.
- థియరిటికల్ పార్ట్ అధికంగా ఉండి ప్రాక్టికల్ పార్ట్ తక్కువగా ఉండటం.
- అడ్మిషన్ల ప్రక్రియలో తీవ్ర జాప్యం.
- జోనల్ సిస్టమ్ ఉన్న రాష్ట్రంలో కామన్ పీజీ సెట్ నిర్వహించడం.
- మారుతున్న కాలానికి అనుగుణంగా కోర్సుల్లో అప్‌గ్రేడేషన్ లేకపోవడం.
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం.
- వర్సిటీల్లో వేల సంఖ్యలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయకపోవడం.
- ఆన్ డిమాండ్ కోర్సులను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం.
- రీసెర్చ్ ఫెసిలిటీస్ లేకపోవడం.

ఫలితంగా ఈ ఏడాది కూడా 40 శాతం సీట్లు కూడా భర్తీ అయ్యే పరిస్థితి లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్లేస్‌మెంట్ సెల్స్‌ను పటిష్టం చేయాలి



యూనివర్సిటీల్లో ప్లేస్‌మెంట్ సెల్స్‌ను పటిష్టం చేయాలి. పరిశ్రమలు, వివిధ కంపెనీల భాగస్వామ్యం లేకపోవడంతో పీజీ విద్యార్థులకు ఉద్యోగాలు రాని పరిస్థితి నెలకొంది. రాష్ట్రం మొత్తం కామన్ పీజీ సెట్ కాకుండా వర్సిటీలు సొంతంగా ప్రవేశ పరీక్షలను నిర్వహించుకోవాలి. సింగిల్ మేజర్, మైనర్ సబ్జెక్టుల గందరగోళ వ్యవస్థకు బదులుగా మూడు సంవత్సరాల యూజీ ప్రోగ్రామ్‌ను కొనసాగించడం ఉత్తమం.

– ఎస్.మన్సూర్ రహమాన్, విశ్రాంత ప్రొఫెసర్, కర్నూలు

యూనివర్సిటీ	కోర్సుల సంఖ్య	మంజూరైన సీట్లు	ఇన్‌టేక్ సీట్లు	భర్తీ అయిన సీట్లు		కేటగిరీ -బి		మొత్తం
				కన్వీనర్‌కోట	స్పాట్	ఇన్‌టేక్	అడ్మిటెడ్	
రాయలసీమ	14	1086	939	193	177	147	89	450
డాక్టర్ అబ్దుల్ హక్	9	330	264	0	0	0	0	264
క్లస్టర్ యూనివర్సిటీ	12	814	814	43	2	0	0	45
మొత్తం	35	2,230	2,017	236	179	147	89	759

బదిలీల్లో సిఫార్సులు, పైరవీలకే పెద్దపీట

- ఆదోని ఏఓ పోస్ట్ విషయంలో ఎమ్మెల్యే సిఫార్సులకు తలొగ్గిన అధికారులు
- ఎమ్మిగనూరు ఏఓ కుర్చీకి పెద్ద ఎత్తున పైరవీలు
- కల్లూరు ఏఓగా విష్ణువర్ధన్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ బదిలీల్లో సిఫార్సులు, పైరవీలకే పెద్దపీట వేసినట్లు తెలుస్తోంది. ఈనెల 26న రాయలసీమ స్థాయిలో అనంతపురంలో బదిలీల ప్రక్రియను చేపట్టారు. మండల వ్యవసాయ అధికారుల బదిలీల్లో కూటమి పార్టీల నేతల సిఫార్సులకు ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఆదోని మండల వ్యవసాయ అధికారిగా అశోక్‌కుమార్‌రెడ్డి దాదాపు రెండేళ్ల నుంచి పని చేస్తున్నారు. ఈయన అక్కడే ఇంకా మూడేళ్లు కొనసాగే అవకాశం ఉంది. ఈయన ఆప్షన్ కూడా ఇవ్వలేదు. అయితే ఆదోని ఎమ్మెల్యే సిఫార్సుతో కర్నూలు సబ్‌డివిజన్‌లో పనిచేస్తున్న ఒక ఏఓ ఆదోని మండల వ్యవసాయ అధికారిగా బదిలీ అయ్యేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అనంతపురంలో జరిగిన బదిలీల ప్రక్రియలో సదరు ఏఓ అధికారులతో వాదనకు దిగినట్లు సమాచారం. వైఎస్సార్‌సీపీ హయాంలో నియమితులైన వారిని ఎలా కొనసాగిస్తారు.. ఎమ్మెల్యే సిఫార్సులను కూడా పరిగణలోకి తీసుకోరా.. అంటూ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అప్పటికీ ఆదోని ఏఓ పోస్టు బ్లాక్ చేసినప్పటికీ తర్వాత ఆదోని ఎమ్మెల్యేతో ఒత్తిడి చేయించుకుని తన పేరును రెకమెండ్ చేకోవడంలో సక్సెస్ అయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఏఓగా ఉన్న అశోక్‌కుమార్‌రెడ్డి ఎలాంటి ఆప్షన్ ఇవ్వకపోయినప్పటికీ బలవంతంగా అక్కడే టెక్నికల్ ఏఓగా నియమించనున్నట్లు తెలుస్తోంది. కల్లూరు ఏఓ నియామకం విషయంలోనూ సిఫార్సులు, పైరవీలకు పెద్దపీట వేసినట్లు సమాచారం. కల్లూరు ఏఓగా విష్ణువర్ధన్‌రెడ్డిని నియమించినట్లు తెలుస్తోంది. కల్లూరు ఏఓగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి ఆప్షన్ ఇచ్చిన మండలాలను పక్కనపెట్టి కోవెలకుంట్ల సబ్ డివిజన్‌కు మార్చినట్లు తెలుస్తోంది. ఎమ్మిగనూరు ఏఓ పోస్టు విషయంలో పైరవీలకే స్థానం లభించింది. ఆదోని ఎమ్మెల్యే సిఫార్సుతో హాలహర్విలో ఉన్న శివశంకర్ ఎమ్మిగనూరు ఏఓగా నియమితులైనట్లు సమాచారం. డోన్ ఎమ్మెల్యే సిఫార్సులతో కదిరిలో ఉన్న శ్రీనివాసరెడ్డి డోన్‌కు రానున్నట్లు సమాచారం. గూడూరు ఏఓగా ప్రస్తుతం కర్నూలు ఏడీఏ కార్యాలయంలో టెక్నికల్ ఏఓగా ఉన్న దస్తగిరిరెడ్డి నియమితులు కానున్నారు. గూడూరులో ఉన్న శ్రీవర్ధన్‌రెడ్డి టెక్నికల్ ఏఓగా నియమితులు కానున్నట్లు సమాచారం. జూన్ 2న వ్యవసాయ శాఖ కమిషనర్ ఆమోదంతో బదిలీల జాబితాలను విడుదల చేయనున్నారు. ఈలోగా అనంతపురంలో జరిగిన బదిలీల రెకమెండేషన్‌లతో అనేక మార్పులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అక్రమ మద్యం విక్రేతల అరెస్టు

కర్నూలు: కల్లూరు ఎస్టేట్‌లో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కల్లూరు ఎస్టేట్‌కు చెందిన జక్కుల మునయ్య వద్ద 22 మద్యం బాటిళ్లు, దేవర ఆంజనేయులు వద్ద 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఇరువురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అలాగే బంగారుపేటలో నాటుసారా స్థావరాలపై దాడులు చేసి సారా విక్రయాలు జరుపుతున్న నీలిషికారి ఆనరి వద్ద 20 లీటర్లు, నీలిషికారి లక్ష్మి వద్ద 30 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకుని ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు కర్నూలు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు నవీన్ బాబు, రెహానా బేగం, కానిస్టేబుళ్లు మధు, సూర్యనారాయణ, రామలింగయ్య, ఈరన్న, సువర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

ఇసుక రీచ్‌లు వద్దే వద్దు



నాగలదిన్నెలో ఇసుక రీచ్ వద్దని అధికారులుకు విన్నవిస్తున్న గ్రామస్తులు

- అధికారులకు విన్నవించుకున్న ప్రజలు

నందవరం: ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయవద్దంటూ నాగలదిన్నె, గంగవరం, జొహరాపురం గ్రామాల ప్రజలు అధికారులకు తెగేసి చెప్పారు. మంగళవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కాలుష్య నియంత్రణ మండలి జిల్లా అధికారి కిశోర్ రెడ్డి నేతృత్వంలో మైనింగ్ శాఖ ఆధ్వర్యంలో నాగలదిన్నె, జొహరాపురం గ్రామాల్లో ఇసుక రీచ్‌ల ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మాట్లాడుతూ నాగలదిన్నె గ్రామంలోని సర్వే నంబర్ 154లో తుంగభద్ర నదిలో 5.363 హెక్టార్లలో ఏడాదికి 53,630 క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలు చేపట్టనున్నట్లు వివరించారు. గంగవరం, జొహరాపురం గ్రామ సర్వే నంబర్లు 1,258లో తుంగభద్ర నదిలో 82,500 క్యూబిక్ మీటర్లు ఏడాదికి సాధారణ ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలు మాట్లాడుతూ నదిలో ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలు ఇంకిపోతాయని, తాగు నీటి ఎద్దడి ఏర్పడుతుందని వివరించారు. రైతులు రూ.లక్షలు వెచ్చించి నది నుంచి వేసుకున్న పైపులైన్లు పగిలి పోతాయని, కోతకు గురవుతాయని పెద్ద కొత్తిలి ఎంపీటీసీ సభ్యుడు విజయమోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రీచ్‌లు ఏర్పాటు చేయవద్దని ఆయా గ్రామాల ప్రజలు వేడుకున్నారు. కాగా నది ఒడ్డున వాటర్ గ్రిడ్లు ఏర్పాటు చేసి నీటి సమస్య పరిష్కరించి ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని నాగలదిన్నె సర్పంచ్ బోయ లక్ష్మి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, జిల్లా మైనింగ్, జియాలజీ విభాగం అధికారి రవిచందు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూర్తి, సీఐ మధుసూదన్‌రావు, మండల సర్వేయర్ అక్బర్‌బాషా పాల్గొన్నారు.

వైద్యపరికరాల కొనుగోలుకు ఆమోదం



సభ్యులతో చర్చిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పలు వైద్యపరికరాల కొనుగోలుకు పర్చేజ్ కమిటీ ఆమోదించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో పలు వైద్యపరికరాల కొనుగోలుకు కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆటో క్లియర్, ఎయిర్ కంప్రెషర్, ఏఎంసీలో ఆక్సిజన్ ప్యానెల్, రెండు హీమోడయాలసిస్ మిషన్లు కొనుగోలు చేయడానికి కమిటీ ఆమోదించిందన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఇవి ఎంతగానో తోడ్పడతాయన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు జనరల్ సర్జరీ హెచ్‌ఓడి డాక్టర్ పి.హరిచరణ్, ఆర్థోపెడిక్ హెచ్‌ఓడి డాక్టర్ కె.శ్రీనివాసులు, ఎండోక్రైనాలజి హెచ్‌ఓడి డాక్టర్ పి.శ్రీనివాసులు, అనెస్తీషియా హెచ్‌ఓడి డా క్టర్ జి.విశాల, మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.లక్ష్మిబాయి, సీఎస్‌ఆర్ ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డబ్బు తీసిస్తానని..

- ఏటీఎం వద్ద వృద్ధులను టార్గెట్ చేస్తున్న కేటుగాళ్లు
- ఏటీఎం మార్పు చేసి రూ.25 వేలు చోరీ



ఎస్‌బీఐ ఏటీఎంలో వృద్ధుడితో ఉన్న కేటుగాడు

నందికొట్కూరు: పట్టణంలోని చౌడేశ్వరిదేవి ఆయలం ఎదుట ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం వద్ద ఓ కేటుగాడు వృద్ధుడిని మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన శ్రీనివాసులు ఆచారి ఏటీఎంలో డబ్బు డ్రా చేసుకోవడానికి వెళ్లగా అక్కడే కాపుకాసిన కేటుగాడు డబ్బు డ్రా చేసి ఇస్తానని మాయమాటలు చెప్పి మొదట అకౌంట్లోని బ్యాలెన్స్ చెక్ చేసి డబ్బు ఉన్నాయని నిర్ధారించుకున్నాడు. అనంతరం తెలివిగా ఏటీఎంను మార్చి మరో ఏటీఎంను వృద్ధుడికి ఇచ్చి చిన్నగా అక్కడ నుంచి తప్పించుకున్నాడు. పట్టణంలోని ఆత్మకూరు రోడ్డులో ఉన్న హెచ్‌డీఎఫ్ ఏటీఎం వద్దకు వెళ్లి అకౌంట్‌లోని రూ.25 వేల నగదును డ్రాచేసుకుని ఉడాయించాడు. డబ్బు డ్రా అయినట్లు ఫోన్‌కు మెసేజ్ రావడంతో ఏటీఎంను చెక్ చేసుకోగా అది తన ఏటీఎం కాదని గుర్తించిన బాధితుడు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గతంలోనూ పట్టణంలోని ఏటీఎం సెంటర్ల వద్ద సదరు నిందితుడు వృద్ధులను మోసం చేసినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

పీఆర్‌లో సజావుగా బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ (పీఆర్) శాఖకు సంబంధించి అనంతపురంలోని పీఆర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జోనల్ స్థాయి (రాయలసీమ జిల్లాలు) బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా ముగిసింది. అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, బాలాజీ (తిరుపతి), చిత్తూరు, నంద్యాల, కర్నూలు జిల్లాలకు చెందిన డీఈఈలు, ఏఈఈలు, జేఈఈలు, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టెక్నికల్ ఆఫీసర్లు హాజరయ్యారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్ ప్రక్రియ సాయంత్రం 6 గంటల వరకూ కొనసాగింది. ఆ శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) బాలూనాయక్, ఎస్‌ఈ జహీర్ అస్లాం, శ్రీసత్యసాయి జిల్లా ఎస్‌ఈ మురళి, ఇతర జిల్లాల ఎస్‌ఈలతో పాటు పీఆర్‌ఐ ఈఈ ప్రభాకరరెడ్డి, అనంతపురం సబ్ డివిజన్-1, 2 డీఈఈలు లక్ష్మీనారాయణ, కృష్ణజ్యోతి, సర్కిల్ కార్యాలయ సూపరింటెండెంట్లు ఖాజా మొహిద్దీన్ తదితరులు పర్యవేక్షించారు. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారితో పాటు రిక్వెస్ట్ బదిలీలనూ ఆమోదించారు.

2న మండల కేంద్రాల్లో ధర్నాలు



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కర్నూలు(అర్బన్): పేదలకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలాన్ని ఇవ్వాలనే డిమాండ్‌పై సీపీఐ ప్రజా పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ జూన్ 2వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అనేక ప్రాంతాల్లో రైతులు పండించిన ధాన్యం తడిచిపోతున్నా, టార్పాలిన్లు కూడా అందించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రధాని నరేంద్రమోదీ భజనలో మునిగి తేలుతున్నారన్నారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రపంచంలోని చిన్న దేశాలతో కాకుండా చైనాతో మన దేశం పోటీ పడాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.గిడ్డయ్య, రాష్ట్ర నాయకులు పి.రామచంద్రయ్య, కె.జగన్నాథం, ఎస్.మునెప్ప తదితరులు పాల్గొన్నారు.